సాక్షి
ప్రకాశం
గురువారం । 2 । నవంబర్ । 2023



ఇంటింటికీ కుళాయి ఇవ్వాలి

జల్‌జీవన్ మిషన్‌లో ఇంటింటికీ కుళాయి ఇవ్వాలని, అందుకు అవసరమైన నిర్మాణాలు పూర్తిచేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు.

- 10లో..



చదువు బోధపడుతోందా ?

ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు పరీక్ష నిర్వహిస్తున్నారు.

- 10లో..

గరిష్టం/కనిష్టం
35.1/26.1

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా పొగమంచు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైద్యారోగ్య శాఖలో ఉద్యోగ నియామకాలపై విచారణ

ఒంగోలు టౌన్: వైద్యారోగ్య శాఖలో 2020లో జరిగిన ఉద్యోగ నియామకాల విషయంలో వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డైరక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాల మేరకు విజయవాడ నుంచి వచ్చిన అధికారుల బృందం బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో విచారణ ప్రారంభించింది. మొత్తం 65 ల్యాబ్ టెక్నీషియన్, 125 స్టాఫ్ నర్సుల పోస్టులకు గాను 40 ఎల్టీ, 20 స్టాఫ్ నర్సుల పోస్టుల నియామక ప్రక్రియ మీద ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో విచారణకు ఆదేశించడం తెలిసిందే. డిప్యూటీ డైరెక్టర్ శేషారెడ్డి, అడిషనల్ డైరక్టర్ నాగరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ విజయభాస్కర్‌ల బృందం ఒంగోలులోని జిల్లా వైద్యారోగ్య శాఖకు చేరుకొని విచారణ ప్రారంభించారు. గతంలో ఇక్కడ పనిచేసి ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులను పిలిపించి మాయమైనట్టు చెబుతున్న ఉద్యోగ నియామకాల ఫైళ్ల గురించి ఆరా తీశారు. స్టాఫ్ నర్సులకు సంబంధించిన ఫైళ్లను బయటకు తీయగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు సంబంధించిన ఫైళ్లు కనిపించలేదని తెలుస్తోంది. గురువారం కూడా విచారణ జరుగుతుందని, నివేదికను డైరక్టర్‌కు నివేదిక ఇస్తామని డీడీ శేషారెడ్డి తెలిపారు. విచారణలో ఏవో గీతాంజలి కూడా పాల్గొన్నారు.

విజిలెన్స్ సీఐ రాఘవరావుకు సేవా పతకం

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు శాఖలో వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు ఉత్తమ సేవా పతకాలను ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. జిల్లా నుంచి ఏడుగురికి ఈ అవార్డులు దక్కాయి. నలగర్ల రాఘవరావు (సీఐ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఒంగోలు) స్టేట్ పోలీసు సేవా పతకానికి ఎంపికయ్యారు. సుగ్రీవ గంగాధరరావు (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, ఒంగోలు), ఉప్పలపాటి ఐజయ్య (ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఒంగోలు), చిన్న వెంకట నారాయణ (ఏఎస్ఐ, కంభం పీఎస్), సాతిల నాగేశ్వరరావు (ఏఎస్ఐ, సీసీఎస్, ఒంగోలు), జమ్ముల కృష్ణుడు (ఎస్ఐ, సీసీఎస్, మార్కాపురం)లను సేవా పతకాలకు ఎంపిక చేశారు. అమిశెట్టి సత్యం (హెడ్ కానిస్టేబుల్, దిశ, ఒంగోలు) కు ఉత్తమ సేవా పతకం లభించింది.

ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో విద్యుత్ కాంతులు

ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ భారం కానివ్వమంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అధికారంలోకి వచ్చిన వెంటనే 200 యూనిట్ల వరకూ ఉచితంగా అందిస్తోంది. అర్హతే ప్రామాణికంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు జిల్లాలోని 96,949 మందికి లబ్ధి చేకూరుతోంది. దీంతో ప్రతి నెలా విద్యుత్ బిల్లులు చెల్లించాలన్న టెన్షన్ వారికి లేకుండా పోయింది.

- జిల్లాలో 96,949 మందికి ఉచిత విద్యుత్
- ఎస్సీ గృహాలు 86,858
- ఎస్టీ గృహాలు 10,091
- ప్రభుత్వంపై నెల భారం రూ.3.66 కోట్లు



గానుగపెంట విద్యుత్ సబ్‌స్టేషన్

మార్కాపురం: జిల్లాలో ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, దర్శితో పాటు నెల్లూరు జిల్లాలోని కందుకూరు సర్కిల్ కూడా ఉంది. మొత్తం ఎస్సీ, ఎస్టీలవి కలిపి 96,949 గృహాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఇందుకోసం ప్రతినెలా రూ.3.66 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది.

జిల్లా భారం రూ.43.96 కోట్లు..

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 200 యూనిట్లలోపు ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంటు ఇస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా ప్రతినెలా రూ.3.66 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తోంది. అంటే ఏడాదికి రూ.43.96 కోట్ల భారాన్ని వారి తరఫున ప్రభుత్వమే భరిస్తోంది. వినియోగదారుల దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలను డిస్కంల క్షేత్రస్థాయి సిబ్బంది పరిశీలిస్తున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ ప్రయోజనాన్ని అందిస్తున్నారు. ఏదైనా సాంకేతిక, క్షేత్రస్థాయి పరిశీలనలో తేడాలుంటే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని సరిదిద్ది లబ్ధిచేకూరుస్తున్నారు. విద్యుత్ సబ్సిడీ గత ప్రభుత్వం ఇచ్చిన దాంతో పోల్చుకుంటే మూడు రెట్లు పెరిగింది. రాయితీలు అందని వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదిస్తే పరిష్కారం లభిస్తుంది.

జిల్లాలో ఇలా...

డివిజన్ పేరు	ఎస్సీ గృహాలు	నెలవారీ బిల్లు (లక్షల్లో)	ఎస్టీ గృహాలు	నెలవారీ బిల్లు (లక్షల్లో)	మొత్తం	మొత్తం బిల్లు (లక్షల్లో)
ఒంగోలు	27058	117.90	3011	10.48	30069	128.37
మార్కాపురం	18073	64.25	3518	8.88	21591	73.12
కనిగిరి	10567	36.67	745	1.81	11312	38.48
దర్శి	20017	74.96	1323	4.30	21340	79.26
కందుకూరు	11143	42.82	1494	4.28	12637	47.10
మొత్తం	86858	336.60	10091	29.74	96949	366.34

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తోంది. వీరు సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం ద్వారా కొత్తగా ఎవరైనా లబ్దిపొందాలనుకుంటే కుల ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత మండల ఏఈకి పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే విచారణ చేసి కనెక్షన్ ఇస్తారు.

– కేవీ సత్యనారాయణ, విద్యుత్ ఎస్ఈ, ఒంగోలు

ప్రతినెలా విద్యుత్ బిల్లు టెన్షన్ లేకుండా పోయింది



నా పేరు బాలయ్య, నాది తర్లుపాడు మండలంలోని రాగసముద్రం ఎస్సీ కాలనీ. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇవ్వడం ద్వారా మాకు ఎంతో లబ్ధిచేకూరుతోంది. ప్రతినెలా విద్యుత్ బిల్లు చెల్లించాలనే టెన్షన్ లేకుండా పోయింది.

– బాలయ్య, రాగసముద్రం ఎస్సీ కాలనీ

చట్టబద్ధంగానే భూమి కొనుగోలు

- 40 ఏళ్ల ఈసీలోను నేడు ఆరోపించిన వారి పేర్లు లేవు
- నేను కొన్న రెండు భూములు బ్యాంకు తనఖాలో ఉన్నవే
- బ్యాంకుల వేలం నోటీసులు పత్రికల్లో ప్రచురించారు
- నా తమ్ముడు రాజకీయాల్లో ఉన్నా నేను పూర్తిగా వాటికి దూరం
- అయినా రాజకీయ కోణంలో ఆరోపణలు తగదు
- 'ఈనాడు' కథనంపై భగ్గుమన్న బాలినేని వేణుగోపాల్‌రెడ్డి



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాలినేని వేణుగోపాల్‌రెడ్డి

ఒంగోలు టౌన్: చట్టబద్ధంగా భూమిని కొనుగోలు చేస్తే అందుకు భిన్నంగా తనపై నిందలు మోపడం, కనీస వివరణ తీసుకోకుండా అసత్య వార్త ప్రచురించడం దారుణం అని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోదరుడు బాలినేని వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక హౌసింగ్‌బోర్డులోని తన నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల వెలుగుచూసిన నకిలీ భూ దస్తావేజులకు సంబంధించిన అంశాలపై సిట్ ఏర్పాటు చేసిన తరుణంలో కొంతమంది దానిని కూడా దుర్వినియోగం చేసుకునేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. తాను కొన్న భూమికి సంబంధించి చట్టబద్ధతను పూర్తిగా పరిశీలించుకున్నాకే కొనుగోలు చేశామన్నారు. తాను రెండు భూములను కొనుగోలు చేశానని, భూమి ఎవరి పేరు మీద భూమి ఉంది, ఎవరి అనుభవంలో ఉంది అనేది తెలుసుకుని కొనుగోలు చేస్తారన్నారు. ఇందుకు 13 సంవత్సరాల ఈసీ సాధారణంగా తీసుకుంటారని కానీ తాను 40 సంవత్సరాల ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్) తీసుకున్నానన్నారు. ఎక్కడా ఇప్పుడు ఆరోపిస్తున్న వారి పేర్లు అందులో లేవన్నారు. భూములు పూర్తిగా తన్నీరు హనుమయ్య (తన్నీరు కోటయ్య మనుమడు) అనుభవంలో ఉన్నాయన్నారు. అందుకు సాక్ష్యంగా రెండు భూముల్లో ఒకదానిని 2010–15లో రిజిస్టర్డ్ మార్టిగేజ్ చేసి టంగుటూరు యూనియన్ బ్యాంకు నుంచి అనుభవదారు రుణం తీసుకున్నారన్నారు. రెండో దానిపై 2017లో ఎస్‌బీఐ నుంచి సింపుల్ మార్టిగేజ్ కింద రుణం తీసుకున్నారన్నారు. ఈ తనఖాలకు సంబంధించి రుణం చెల్లించకపోతుండడంతో సంబంధిత బ్యాంకులు వేలం వేస్తున్నట్లు పత్రికల్లో కూడా ప్రచురించాయన్నారు. 2021 డిసెంబర్ 23న న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో, 2021 నవంబరులో ఆంధ్రజ్యోతిలో ఈ వేలం నోటీసులు వచ్చాయన్నారు. తాను భూమిని కొనుగోలు చేసే సమయంలో ఈసీలను పరిశీలించుకోవడమే కాకుండా చివరకు ఈనాడు పత్రికలో 2022 ఆగస్టులో ప్రకటన కూడా ఇచ్చామన్నారు. తాను భూమిని కొనుగోలు చేయదలిచానని, ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కూడా కోరామన్నారు. కానీ ఎవరి నుంచి ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదన్నారు. ఈ నేపథ్యంలోనే తాను చట్టబద్ధంగా భూమిని రిజిస్టర్ చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు గాను అనుభవదారు బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాన్ని కూడా తానే ఆర్టీజీఎస్ ద్వారా ఎస్‌బీఐ రుణ ఖాతాకు రూ.25 లక్షలు, యూనియన్ బ్యాంకు రుణఖాతాకు రూ.14 లక్షలు చెక్కు ద్వారా చెల్లించామన్నారు. ఇది ఎటువంటి దాపరికం లేని వ్యవహారం అన్నారు. ఎవరో ఏదో ఆరోపిస్తే కనీసం తనను సంప్రదించి మీ కథనంతోపాటు నా వాదన కూడా ప్రచురించి ఉంటే బాగుండేదని కానీ అలా కాకుండా ఇలా ప్రచురించడం ఎంతవరకు సబబు అన్నారు. తన తమ్ముడు రాజకీయాల్లో ఉన్నా తాను పూర్తిగా వ్యాపారానికే పరిమితమని, ఎప్పుడూ రాజకీయాల జోలికి వచ్చేవాడ్ని కాదన్నారు. కానీ నేడు రాజకీయ కుట్రకోణంలో ఇలాంటి నిరాధార వార్తలు ప్రచురణ కావడం బాధ కలిగించిందన్నారు. తాను చట్టబద్ధంగా కొన్న భూములకు సంబంధించిన డాక్యుమెంట్ల వివరాలన్నీ బహిర్గతం చేసిన దృష్ట్యా ఏ ఒక్క పత్రమైనా తప్పు అని నిరూపిస్తే కొనుగోలు చేసిన ఆస్తిని వదులుకునేందుకు తాను సిద్ధమన్నారు. మరో వైపు రియల్ బ్రోకర్ ఒకరు రూ.8 లక్షలకు ఆస్తిని కొన్నట్లు, డబ్బులు ఇవ్వాలని తనను ఫోన్‌లో డిమాండ్ చేశారని దానిని తాను పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే తప్పుడు ఫిర్యాదులు రావడం ద్వారా డబ్బులు కోసం డిమాండ్ చేస్తే లొంగి డబ్బులు ఇచ్చే వ్యక్తిని కానని బాలినేని వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఎస్పీకి ఫిర్యాదు:

పత్రికా సమావేశం అనంతరం బాలినేని వేణుగోపాల్‌రెడ్డి ఎస్పీ మలికాగర్గ్‌ను ఎస్పీ ఛాంబర్‌లో కలిసి తమ కుటుంబంపై అపప్రద కలిగేలా కుట్రపన్నుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. తాను నిబంధనలకు లోబడే భూమిని కొనుగోలు చేశామన్నారు. తాను కొన్న భూమికి సంబంధించి లావాదేవీలన్నీ స్పష్టంగా ఉన్నాయంటూ సంబంధిత వివరాలతో కూడిన పత్రాన్ని ఎస్పీకి అందించారు. తన కుటుంబాన్ని అప్రదిష్టపాలు చేయాలని యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

భూ ఆక్రమణల నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలి

- సిట్ బృందంతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: నకిలీ పత్రాలు, స్టాంప్, ఫోర్జరీ సంతకాలతో జరిగిన భూ ఆక్రమణల్లో నిందితులను త్వరగా అరెస్టు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. భూ అక్రమాలపై ఏర్పడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సభ్యులతో బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సమీక్షించారు. ఈ అక్రమాలకు సంబంధించి ఇప్పటి వరకు 30 కేసులు నమోదయ్యాయని ఎస్పీ మలికాగర్గ్ కలెక్టర్‌కు వివరించారు. మొత్తం 69 మందిని ముద్దాయిలుగా గుర్తించామని వారిలో 29 మందిని అరెస్టు చేసామని తెలిపారు. మిగిలిన వారికోసం గాలిస్తున్నామన్నారు. స్పందించిన కలెక్టర్ ముద్దాయిలను త్వరగా అరెస్టు చేయాలని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. దర్యాప్తు విషయంలో పోలీసు, రెవిన్యూ, రిజిస్ట్రేషన్ ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఏఎస్పీ నాగేశ్వరరావు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మరియదాసు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, కనిగిరి డీఎస్పీ రామరాజు, జిల్లా రిజిస్ట్రార్, ఒంగోలు తహశీల్దారు మురళి పాల్గొన్నారు.

నకిలీ పత్రాల కేసులో మొత్తం 29 మంది అరెస్టు

ఒంగోలు టౌన్: నకిలీ డాక్యుమెంట్ల కేసులో ఇప్పటి వరకు 30 కేసులు నమోదు కాగా 29 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కేసుల పురోగతిపై సిట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు జరుగుతున్న తీరుతెన్నులు, పురోగతి, నిందితుల అరెస్టు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసులకు సంబంధించిన డాక్యుమెంట్లు, సీడీ ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రాంతాలు, కేసుల వారీగా నకిలీ డాక్యుమెంట్లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, రిజిస్ట్రార్‌లను సమన్వయం చేసుకొని దర్యాప్తును కొనసాగించాలని చెప్పారు. ఈ కేసులకు సంబంధించి ప్రతి డాక్యుమెంటును పరిశీలించామని, పలు నకిలీ డాక్యుమెంట్లను సీజ్ చేసి, 29 మంది నిందితులను అరెస్టు చేయడమే కాకుండా మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేసి శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, డీఎస్పీలు నారాయణస్వామి రెడ్డి, అశోక్ వర్ధన్, రామరాజు, సిట్ సీఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను నిర్దేశించిన గడువులో తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ప్రతి 15 రోజులకు స్పష్టమైన పురోగతి కనిపించాలన్నారు. నిర్మాణాల పురోగతిని తెలిపేలా ఫొటోలు తీసి పంపాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించిన ప్రాంతాలకు ఈఈలు వెళ్లి పరిష్కరించి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, పంచాయతీ రాజ్ ఎస్ఈ కొండయ్య డీఈఈ, ఏఈఈ పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయం

- తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు ఆయన త్యాగం మరువలేనిది
- కలెక్టర్, ఎంపీ, జెడ్పీచైర్‌పర్సన్, ఎస్పీ, నగర మేయర్
- ఘనంగా 68వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, మాగుంట శ్రీనివాసులరెడ్డి, దినేష్‌కుమార్, మలికాగర్గ్, గంగాడ సుజాత, వైఎం.ప్రసాద్‌రెడ్డి, కుప్పం ప్రసాద్

ఒంగోలు అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అదే స్ఫూర్తితో జిల్లాను అన్నీ విధాలుగా అభివృద్ధి పథంలో నడిపేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. బుధవారం 68వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎస్పీ మలికాగర్గ్, నగర మేయర్ గంగాడ సుజాతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రకాశం భవనంలో జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత స్పందన హాలులో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసేందుకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు ద్వారా ప్రత్యేక గుర్తింపు లభించిన నవంబర్ 1వ తేదీనే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంగా జరుపుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకుని దశాబ్దాలుగా ఉన్న సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. తెలుగు ప్రజల సర్వతోముఖాభివృద్ధి చెందాలన్న అమరజీవి ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాడారని, అదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని అన్నీ విధాలుగా అభివృద్ధి చేసేలా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రత్యేక గుర్తింపు తేవడంలో, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయడంలో పొట్టి శ్రీరాములు కృషి చిరస్మరణీయమన్నారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. దీనిలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, జేసీ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ శౌర్యపటేల్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



వేడుకలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నేడు మంత్రి సురేష్ రాక

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం యర్రగొండపాలెంలో పర్యటించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక కొలుకుల రోడ్డులో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకును ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రసాద్‌కు ఫొటో జర్నలిస్టు అవార్డు

ఒంగోలు మెట్రో: ప్రపంచ ఫొటోగ్రఫీ డే, జర్నలిజం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడెమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అవార్డులు ప్రకటించారు. ఫొటో జర్నలిస్టు అవార్డుకు ప్రకాశం జిల్లా మీడియా కెమెరామెన్ అసోసియేషన్ సభ్యులు 'సాక్షి' దినపత్రిక ఫొటోగ్రాఫర్ ఎం.ప్రసాద్, 'హిందూ' దినపత్రిక ఫొటోగ్రాఫర్ శ్రీనివాసరావు ఎంపికయ్యారు. బుధవారం విజయవాడలోని బాలోత్సవ్ భవనంలో నగదుతో పాటు ప్రశంస పత్రాన్ని వారు అందుకున్నారు. సహచరులు శ్రీనివాసరావు, ప్రసాద్ లకు మీడియా కెమెరామెన్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ప్రసాద్

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం

పామూరు: మతిస్థిమితం లేని వ్యక్తి ఆర్టీసీ బస్సు అద్దాలు పగలగొట్టిన ఘటన బుధవారం పామూరు మండలంలోని బొట్ల గూడూరులో చోటుచేసుకుంది. వివరాలు.. జమ్మలమడుగు డిపోకు చెందిన ఆర్టీసీ బస్ విజయవాడ వెళ్తుండగా బొట్లగూడూరు వద్ద అపమాంబాపురం గ్రామానికి చెందిన చిట్టి బాబు అనే వ్యక్తి రాయి విసిరాడు. దీంతో బస్సు ముందు వైపు అద్దం పగిలిపోయింది. స్థానికులు అతడిని స్టేషన్‌లో అప్పజెప్పారు. మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించినట్లు ఎస్సై కె.సురేష్‌యాదవ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గిద్దలూరు రూరల్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గిద్దలూరు మండలంలోని సంజీవరాయుడుపేట గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. బురుజుపల్లె గ్రామానికి చెందిన అగ్నిగుండాల ఈశ్వరయ్య(36) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సంజీవరాయుడుపేటలో డిష్ కేబుల్ తీగ లాగేందుకు వెళ్లిన ఈశ్వరయ్యకు ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై ట్రాన్స్‌ఫార్మర్ మీద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య నలుగురు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చదువు బోధపడుతోందా?

- రేపు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై పరీక్ష
- దేశ వ్యాప్తంగా స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా..
- అక్టోబర్ 27 నుంచి నేటి వరకు ప్రాక్టీస్ టెస్టుల నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా 1,546 పాఠశాలల్లో పరీక్షకు ఏర్పాట్లు


పుల్లలచెరువు జెడ్పీ హైస్కూల్లో మాదిరి ప్రశ్నపత్రంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలు సహా అన్ని రాష్ట్రాల్లో పాఠశాల విద్యా వ్యవస్థ స్వరూపాన్ని, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే–2023(ఎస్ఈఏఎస్) నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా నవంబర్ 3వ తేదీ శుక్రవారం ఎస్ఈఏఎస్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఎంపిక చేసిన 1,546 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు ఓఎంఆర్ సీట్స్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటికే మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాపులు ఏర్పాటు చేయడంతోపాటు అక్టోబర్ 27 నుంచి విద్యార్థులకు ప్రాక్టీస్ టెస్టులు నిర్వహిస్తున్నారు. నవంబర్ 2వ తేదీతో ప్రాక్టీస్ టెస్టులు ముగియనున్నాయి.

పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రతి మూడేళ్లకు ఒకసారి ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నారు. 2024 ఫిబ్రవరిలో జాతీయ స్థాయి సర్వే నిర్వహించాలని కేంద్ర విద్యా శాఖ నిర్ణయించింది. దానికి ముందుగా రాష్ట్ర విద్యా పరిశోధన మండలి ఆధ్వర్యంలో నవంబర్ 3న ఎస్ఈఏఎస్ నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. ప్రశ్నపత్రాలు ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి.

ఓఎంఆర్ విధానంలో పరీక్ష

ఎస్ఈఏఎస్ సర్వే పరీక్షను ఈ నెల 3వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు. పరీక్ష ఓఎంఆర్ విధానంలో ఉంటుంది. 3, 6వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌లో గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్‌లో గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. 3వ తరగతి విద్యార్థులకు గంట, 6వ తరగతి విద్యార్థులకు 75 నిమిషాలు, 9వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాల పరీక్ష సమయం కేటాయించారు.

3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్‌పై, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి, 9వ తరగతి విద్యార్థులకు 8వతరగతి సిలబస్‌పై పరీక్ష నిర్వహించనున్నారు.

ఎస్ఈఏఎస్ పరీక్ష వివరాలు

తరగతి	పరీక్ష రాసే విద్యార్థుల సంఖ్య
3	13,204
6	13,519
9	12,896
మొత్తం పాఠశాలలు	1,546

ప్రాక్టీస్ చేయిస్తున్నాం



పాఠశాలలో 6, 9వ తరగతి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయిస్తున్నాం. ముఖ్యంగా లాంగ్వేజ్‌తో పాటు గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నాం. 6, 9 తరగతుల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తున్నారు. ఇలాంటి పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకోవచ్చు.

– లిల్లీప్రకాశ్‌వాణి, కేజీబీవీ ప్రిన్సిపాల్, పుల్లలచెరువు

అభ్యసన విధానాలు మెరుగవుతాయి

దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థలోని బలాలు, బలహీనతలు అంచనా వేయడం, లోపాలను గుర్తించి గుణాత్మక బోధనతో అభ్యసన లక్ష్యాలను సాధించేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించడమే ఎస్ఈఏఎస్ సర్వే పరీక్ష లక్ష్యం. భవిష్యత్‌లో అభ్యసనా విధానాల్లో తగిన మార్పులకు అవకాశం ఉంటుంది.

– శామ్యూల్‌జాన్, ఎంఈఓ పుల్లలచెరువు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

యర్రగొండపాలెం: మండలంలోని పొన్నలబైలు చెంచుగూడేనికి చెందిన భూమని వీరయ్య(45) అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతి చెందాడు. దాదాపు 10 రోజుల క్రితం స్వచ్ఛంద సంస్థ ఉచితంగా ఇచ్చే కోడి గుడ్ల పంపిణీ వద్ద జరిగిన వివాదంలో వీరయ్యను అదే గూడేనికి చెందిన అంజి కొట్టడం వల్లే తన భర్త వీరయ్య మృతి చెందాడని భార్య అంకమ్మ ఆరోపించింది. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ యర్రగొండపాలెంలోని ఒక ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స పొందుతున్నాడని, ఈ క్రమంలోనే వీరయ్య మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. డాక్టర్ వద్ద వైద్య పరీక్షలు చేయించుకుని స్వగ్రామానికి వస్తూ మార్గమధ్యంలో హనుమంతుని చెంచుగూడెంలో ఆగాడని, అక్కడ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ టోర్నీకి మెడికో సుధీర్

ఒంగోలు టౌన్: కేరళలో నవంబర్ 10 నుంచి నిర్వహించనున్న సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ ఇంటర్ వర్శిటీ టోర్నీకి ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాల సెకండియర్ విద్యార్థి సుధీర్‌కుమార్ ఎంపికయ్యాడు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్శిటీ బాస్కెట్‌బాల్ టీం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న సుధీర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఏడుకొండలు, పీడీ రాధాకృష్ణ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం


కొనకనమిట్లలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కేపీ


చెన్నారెడ్డిపల్లిలో బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

- ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి
- కొనకనమిట్ల మండలంలో 3 సచివాలయాలు, 2 ఆర్బీకేలు, కొనకనమిట్ల, తర్లుపాడు మండలాల్లో రోడ్లు ప్రారంభం

కొనకనమిట్ల/తర్లుపాడు: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొనకనమిట్లలో గ్రామ సచివాలయం, తువ్వపాడు, గార్లదిన్నె గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, కొనకనమిట్ల నుంచి నాగంపల్లి వరకు 13 కి.మీ మేర 6.76 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డితో కలిసి ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి 1.36 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారని పేర్కొన్నారు. తద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ షాజిదా, పీఆర్ డీఈ శ్రీధరరెడ్డి, ఏఈ నిరంజన్, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, పశువైద్యాధికారి రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కె.రాజకుమారి, వైస్ ఎంపీపీలు మెట్టు వెంకటరెడ్డి, గొంగటి జెసీఫా, మండలపార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు శిగినం లక్ష్మీతిరుపతమ్మ, శిలువకుమారి, పెదకొండయ్య, ఎంపీటీసీలు కల్లం సుబ్బమ్మ దిబ్బారెడ్డి, చిన్నమ్మి, గ్రామ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

తర్లుపాడు మండలంలో బీటీ రోడ్డు ప్రారంభం

తర్లుపాడు మండలంలో రూ.7.19 కోట్లతో గోరుగుంతలపాడు నుంచి సూరేపల్లి, తుమ్మలచెరువు నుంచి చెన్నారెడ్డిపల్లి వరకు 10.48 కి.మీ మేర నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే కేపీతో కలిసి ఎంపీ మాగుంట ప్రారంభించారు. అనంతరం స్థానిక ఆర్బీకేను సందర్శించారు. రైతులకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని స్థానిక నాయకులు శ్రీకాంత్‌రెడ్డి ఎంపీ మాగుంటను కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ఇందిర హనుమారెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు సుజాత, చెన్నకేశవులు, సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పెద్దమస్తాన్, మండల పార్టీ అధ్యక్షులు మురారి, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, సర్పంచ్‌లు రామిరెడ్డి, మీరయ్య, అంజయ్య, శిఖామణి, రమణారెడ్డి, దాసయ్య, రమణయ్య, ఎంపీటీసీలు పార్వతి రమేష్ రెడ్డి, వెంకటయ్య, నాయకులు మందా కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేషయ్య, వెన్న సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజును ఈనెలాఖరులోగా చెల్లించాలని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ మండలి పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫీజు రూ.550, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫీజు రూ.550, సైన్స్ విద్యార్థులు అయితే ప్రాక్టికల్స్ పరీక్ష ఫీజు రూ.250 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతంలో ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు కూడా 2024 మార్చిలో జరిగే పరీక్షలు రాసేందుకు అర్హులని, వారు కూడా పరీక్ష ఫీజును వారు చదివిన కాలేజీలో చెల్లించాలన్నారు. నిర్ణీత ఫీజు కంటే అదనంగా ఫీజు వసూలు చేసిన కాలేజీ యాజమాన్యాలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజును ఈనెలాఖరులోగా చెల్లించాలని, వెయ్యి రూపాయల అపరాధ రుసుముతో డిసెంబర్ 15వ తేదీలోపు చెల్లించవచ్చన్నారు. కళాశాల బోధన సిబ్బంది వివరాలు సెక్షన్లకు అనుగుణంగా జ్ఞానభూమి పోర్టర్ 2023–24లో పొందుపరచాలని, ఈ అప్‌లోడ్ చేయడంలో ఏ విధమైన తప్పుడు సమాచారాన్ని పొందుపరిచినా ఒక్కొక్క బోధనా సిబ్బందికి రూ.3 వేలు జరిమానా విధిస్తారని హెచ్చరించారు. అప్‌లోడ్ చేసిన సిబ్బంది విధిగా ఇంటర్మీడియెట్ బోర్డు నిర్దేశించిన విధులను తప్పక నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ విధులకు గైర్హాజరయ్యే బోధనా సిబ్బందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున జరిమానా విధిస్తారన్నారు. ఈ జరిమానాలన్నీ కాలేజీ జ్ఞానభూమి పోర్టర్‌లో పొందుపరుస్తారని చెప్పారు. ఈ జరిమానాలు చెల్లించిన తరువాతే రాబోయే విద్యా సంవత్సరానికి కాలేజీకి అఫిలియేషన్ మంజూరు చేస్తారని చెప్పారు. అన్ని సెక్షన్లకు అనుగుణంగా సరిపడని బోధన సిబ్బంది లేకపోతే అటువంటి కాలేజీలో అదనపు సెక్షన్‌లో ఉన్న విద్యార్థులకు పరీక్షలు జరపరని స్పష్టం చేశారు.

అమరజీవి ఆశయాలే లక్ష్యంగా పాలన


పొట్టి శ్రీరాములు, టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కుప్పం ప్రసాద్, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ మీనావెంకట్రావు, వేమూరి బుజ్జి, పార్టీ నాయకులు

- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

ఒంగోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయాలే లక్ష్యంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో 68వ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ.. భాషా ప్రయుక్త రాష్ట్ర ఆవశ్యకతను తెలియజేస్తూ పొట్టి శ్రీరాములు 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణ త్యాగం చేసిన ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. అటువంటి మహనీయుని త్యాగాన్ని సైతం విస్మరించి గత టీడీపీ ప్రభుత్వం జూన్ 2వ తేదీని రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ప్రకటించడం తెలుగువారి మనోభావాలను దారుణంగా దెబ్బతీసిందన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే తెలుగు వారి ఆత్మాభిమానాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబరు 2వ తేదీగా ప్రకటించారని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని, ఆయన సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మీనాకుమారి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, చాత్తాద శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, ఒంగోలు సూపర్ బజార్ డైరెక్టర్ వల్లెపు మురళి, రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, కుర్రా ప్రసాద్‌బాబు, జ్యోతి, నగర కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొని అమరజీవికి నివాళులర్పించారు.

ఇంటింటికీ కుళాయి ఇవ్వాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్


జల్‌జీవన్ మిషన్‌పై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి ఇవ్వాలని, అందుకు సంబంధించి నిర్మాణ పనులు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో జలజీవన్ మిషన్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే మూడు నెలల్లోపు జలజీవన్ మిషన్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. మూడు నెలలుగా ఈ నిర్మాణాలకు సంబంధించిన నిధులకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. కాంట్రాక్టర్లతో పనులు పూర్తి చేయించడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇచ్చిన లక్ష్యాలను సాధించేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కుళాయిలు ఇంటి లోపల ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. నిర్మాణ పనులకు సరిపడా బృందాలతో పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ పథకం కింద క్షేత్ర స్థాయిలో అన్నీ ప్రభుత్వ భవనాలకు కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. పూర్తయిన గ్రామాలను హర్‌ఘర్ జల్ గ్రామాలుగా ప్రకటించి ధ్రువీకరణ ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు.పనులకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేసి కాంట్రాక్టర్లకు చెల్లించాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శౌర్యపటేల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే అరెస్టుకు సిద్ధం

- ఎల్లో మీడియాలో మొత్తం తప్పుడు కథనాలే..
- డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు ఆగ్రహం


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ మాధవరావు

ఒంగోలు: తనపై పచ్చ పత్రికల్లో చేసిన ఆరోపణలు నిరూపిస్తే అరెస్టుకు సిద్ధమని డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు స్పష్టం చేశారు. బుధవారం ఒంగోలు రాజీవ్‌నగర్‌లోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెలనాటి మాట్లాడారు. తనను భూకబ్జాదారునిగా చిత్రీకరిస్తూ కథనాలు వండివార్చడం సరికాదన్నారు. ఎల్లో మీడియాలో తనపై ప్రచురించిన అసత్య కథనంపై వాస్తవాలను వెలనాటి వివరించారు. రాజీవ్‌నగర్‌లో దేవతు ముసలారావు(పాప) కుటుంబానికి ఉన్న భూమిలో కొంత విక్రయించగా మిగిలిన 46 సెంట్ల విషయమై వివాదం తలెత్తిందని తెలిపారు. ముసలారావు కుటుంబీకుల వద్ద 1904, 1930 సంవత్సరాలకు సంబంధించిన దస్తావేజులు ఉన్నాయన్నారు. అయితే 1984లో భూమి కొన్నామంటున్న వారు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆశ్రయించగా నగరపాలక సంస్థ ద్వారా కొలతలు వేయాలని సూచించడంతో దానికి తాను వెళ్లానని చెప్పారు. ఈ వివాదంపై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోందన్నారు. కోర్టు తీర్పును బట్టి అర్హులైన వారికి భూమి చెందుతుందని, ఇందులో తన ప్రమేయం ఏముందని ప్రశ్నించారు. సిట్‌కు అందిన ఫిర్యాదులను వక్రీకరించి, తాను భూమి కబ్జా చేశానని వార్తలు రాయడం ఎంత వరకు సబబన్నారు. కనీస అవగాహన లేకుండా వార్తలు రాయడం మానుకోవాలని ఎల్లో మీడియాకు హితవు పలికారు. ఒక వేళ సిట్ తనను దోషిగా తేలిస్తే అరెస్టుకు కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు. దేవతు ముసలారావు కుమారుడు దేవతు కిషోర్ మాట్లాడుతూ.. తమ భూమికి సంబంధించి 2008లో వివాదం తలెత్తగా తన తండ్రి కోర్టును ఆశ్రయించారని చెప్పారు. దీనిపై కోర్టు నియమించిన కమిషన్ 2011లో తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. 2021లో ఇళ్లు నిర్మించుకునేందుకు పొజిషన్ చూపించాలని నగరపాలక సంస్థ అధికారులను కోరగా వారు పరిశీలించి హద్దులు చూపారని తెలిపారు. 2022లో ఐదుగురు వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేసి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆశ్రయించగా తాము డాక్యుమెంట్లు చూపామన్నారు. వివాదం సరికాదని, స్థలం కొలతలు వేసి ఎవరిదైతే వారు తీసుకోవాలని బాలినేని సూచిస్తే నేటి వరకు వారు కొలతలకు రాకుండా ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేయడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కథనాలు వండివార్చడం పచ్చ పత్రికలకు పరిపాటిగా మారిందని కార్పొరేటర్లు తాడి కృష్ణలత, శాండిల్య విమర్శించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- కలెక్టర్ దినేష్‌కుమార్


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పారదర్శకంగా పరిష్కారించాలని, ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితి సవరణ, ప్రత్యేక క్యాంపెయిన్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. బీఎల్ఓలు, ఏఈఆర్ఓల లాగిన్‌లో ఓటర్ల జాబితా అప్‌డేట్ కాకపోవడం తదితర కారణాలతో జిల్లాలో మొత్తం 50,360 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోపు పరిష్కరించాలన్నారు. 4, 5 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఉన్నందున ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ట్రైనీ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు సత్యం, రాజశేఖర్, రసూల్, కాలేషా, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

మార్కాపురం రూరల్: వంట చేస్తుండగా నిప్పు రవ్వలు ఎగిసిపడి పూరి గుడిసెకు అంటుకున్న ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దాసరి నాగమ్మ అనే మహిళ తన ఇంట్లో వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి గుడిసెకు అంటుకున్నాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసింది. ఈ క్రమంలో మంటల ధాటికి గాయపడిన నాగమ్మను మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతి చెందిన పుల్లయ్య

గిద్దలూరు రూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గిద్దలూరు మండలంలోని తంబళ్లపల్లె క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కొమరోలు మండలం దద్దవాడ గ్రామానికి చెందిన అలసందలపల్లె పుల్లయ్య(46) తిరుపతిపల్లె గ్రామంలోని బంధువుల ఇంట పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్తున్నాడు. అదే సమయంలో తిరుపతిపల్లె గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసులు బైక్‌పై ఎదురుగా వస్తుండగా పరస్పరం ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన పుల్లయ్యను చికిత్స నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గిద్దలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

పేస్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్

ఒంగోలు: స్థానిక పేస్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆకురాతి వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ పీఎల్ఎస్ వర్మ పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్స్ ఆఫ్ ఐడియల్స్ ఇన్ టెర్నరి గామా సెమీరింగ్స్ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్‌ను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ చేతులమీదుగా డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏకే యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు అభినందనలు



హరిబాబుకు అభినందనలు తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ హరిబాబుకు గుజరాత్ కెమిస్ట్రీ టీచర్స్ అసోసియేషన్ ఉత్తమ ఆచార్య అవార్డు అందించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్, విద్యావంతుల వేదిక ప్రతినిధి, శ్రీనిధి విద్యాసంస్థల కరస్పాండెంట్ విజయరత్నం, తదితరులు హరిబాబును ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న కొత్తపట్నం ఎంపీడీఓ సుజాత

కొత్తపట్నం (ఒంగోలు సెంట్రల్): గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని కొత్తపట్నం ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత కోరారు. కొత్తపట్నం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సచివాలయ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు రెండు పూటలా వేయాలని, జేకేసీ స్పందన కార్యక్రమం విధిగా నిర్వహించాలని చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించి వారి ఫొటోలు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. అన్ని డిపార్ట్‌మెంట్ల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈఓపీఆర్డీ బాలచెన్నయ్య, ఎస్‌ఏ సుదర్శన్, ఆదిత్య, పవన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు బండ్లమూడి విద్యార్థి



హేమంత్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

చీమకుర్తి: మండలంలోని బండ్లమూడి జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థి మురారి హేమంత్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం టీఎల్ కాంతారావు తెలిపారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల బూదవాడలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో ఎంపిక చేసిన జట్టుకు హేమంత్ ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున పాల్గొంటున్న సందర్భంగా హేమంత్‌ను హెచ్‌ఎంతో పాటు పీడీ, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

అమరజీవి త్యాగం మరవలేనిది

- ఆ విషయాన్ని గుర్తించి జీవో విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు
- రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్



ఆర్యవైశ్యభవన్ వద్ద అమరజీవికి నివాళులర్పిస్తున్న కుప్పం ప్రసాద్, తదితరులు



కలెక్టరేట్‌లో విద్యార్థులను ప్రశంసిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



లయన్స్ క్లబ్ సిటిజన్స్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములుకు నివాళులు

ఒంగోలు సెంట్రల్: గత ప్రభుత్వం అమరజీవి త్యాగాన్ని మరిచి నవంబర్ 1 ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని విస్మరించిన నేపథ్యంలో.. ఆర్యవైశ్యులు అమరజీవి త్యాగాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, కావలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు కుప్పం ప్రసాద్ తెలిపారు. సీఎం తక్షణమే స్పందించి నవంబర్ 1నే ఏపీ అవతరణ దినోత్సవం నిర్వహించాలని, అమరజీవికి నివాళి అర్పించాలని జీవో విడుదల చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఆర్యవైశ్యభవన్‌లో బుధవారం నిర్వహించిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుకల్లో కుప్పం ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి జీవో ఇవ్వడం వలనే నేడు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులందరికీ గౌరవం కూడా లభిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా మాజీ అధ్యక్షుడు చలువాది బదరీ నారాయణ, జిల్లా అధ్యక్షుడు రావూరి కాశీరంగా జనార్దన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జలదంకి వెంకట కృష్ణారావు, జిల్లా గౌరవ సలహాదారు పల్లపోతు వెంకటేశ్వర్లు, వాసవీ సేవాదళ్ అధ్యక్షుడు చిదేళ్ల వేణుగోపాల్, సెక్రటరీ కొల్లాపూడి బ్రహ్మయ్య, పలు సంఘాల బాధ్యులు కొణిజేటి సురేష్, హరీష్, హరి, అమర వేణుగోపాల్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొని అమరజీవి చిత్రపటానికి నివాళులర్పించి ఆయన త్యాగనిరతిని కొనియాడారు.



గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

బీజేపీ ఆధ్వర్యంలో...

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని బుధవారం బీజేపీ నాయకుడు గుర్రం రంగనాథ్ ఆధ్వర్యంలో ఒంగోలు గాంధీరోడ్డులో ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. బీజేపీ మీడియా జిల్లా ఇన్‌చార్జి ధనిశెట్టి రాము నాయుడు, ఐటీ వింగ్ ఇన్‌చార్జి సత్యనారాయణ, మండల కార్యదర్శి మిరియం శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్, సుమంత్, సత్యం, పవన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకల్లో విద్యార్థులను ప్రశంసించిన కలెక్టర్...

ఒంగోలు అర్బన్: 68వ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన భవనంలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రశంసించారు. వల్లూరు, టంగుటూరు మండలాలకు సంబంధించి జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటారు. విద్యార్థులను కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు అభినందించారు.

బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో...

ఒంగోలు మెట్రో: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఒంగోలు లయన్స్ క్లబ్ సభ్యులు పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. పర్యావరణ పరిరక్షణ, భావితరాలకు సంరక్షణ అనే పేరుతో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు వేస్ట్ క్యాంపెయినింగ్ కలెక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ వేస్ట్ ద్వారా సారవంతమైన భూములు, నదులు కలుషితమై ప్రజలను పీడిస్తున్నట్లు తెలిపారు. దానిని అరికట్టడానికి లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ తంగుడు ఉపేందర్‌రావు, ఆడిటర్ కె.రాజేంద్రప్రసాద్, కాంప్లెక్స్ ప్రెసిడెంట్ కోడూరి సత్యనారాయణ, సెక్రటరీ ఆర్ఎస్ శీను, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ప్రతినిధి అద్దంకి శ్రీనివాసరావు, చలువాది హనుమంతరావు, సభ్యులు పాల్గొన్నారు.



ఈ వేస్ట్ క్యాంపెయినింగ్‌లో పాల్గొన్న లయన్స్ సభ్యులు



గాంధీరోడ్డులో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సీవీఎన్ రీడింగ్ రూమ్‌లో...

ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూమ్ సెంటర్లో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో పూలమాలలతో నివాళులర్పించారు. ప్రెసిడెంట్ వెన్నపూస శ్రీరాములురెడ్డి, డీవీ రాఘవ, సభ్యులు శాండిల్య, అడపాల వెంకటేశ్వర్లు, మిర్యాల కృష్ణ, బీఎస్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు.

జిల్లా గ్రంథాలయంలో...

ఒంగోలులోని జిల్లా గ్రంథాలయ సంస్థలో కార్యదర్శి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంగా తెలుగు తల్లి, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

నారుమడుల పెంపకంపై అవగాహన అవసరం



జనపనార సంచులు ప్రదర్శిస్తున్న పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పొద ప్రసాద్, పొగాకు బోర్డు అధికారులు

మద్దిపాడు: నారుమడుల పెంపకం, బెట్ట పరిస్థితుల్లో పొగాకు పంట పండించడం ఎలా అనే అంశాలపై వెల్లంపల్లి పొగాకు బోర్డు ఏఎస్ సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో పొగాకు రైతులకు సీటీఆర్ఐ, ఐటీసీకి చెందిన సైంటిస్టులతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోర్డు ప్రొడక్షన్ మేనేజర్ డాక్టర్ కృష్ణశ్రీ మాట్లాడుతూ ట్రేలలో నారు పెంపకం వలన రైతులకు కలిగే ఉపయోగాలను వివరించారు. ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితుల్లో నారును ట్రేలలో పెంచడమే మేలని అన్నారు. ట్రేలలో పెరిగే మొక్కలు బెట్ట పరిస్థితులను తట్టుకుంటాయన్నారు. రైతులు వీలైనంత వరకూ నాణ్యత కలిగిన పొగాకునే పండించేందుకు ప్రయత్నించాలని ఆమె సూచించారు. బోర్డు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ దామోదర్ మాట్లాడుతూ ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వలన పర్యావరణం దెబ్బతింటుందని, ప్లాస్టిక్ పెనుభూతంగా మారి ప్రపంచాన్ని చుట్టిపడేస్తుందని, వీలైనంత వరకూ ప్లాస్టిక్ వాడకుండా ప్రతిఒక్కరూ గుడ్డసంచులు, జనప నారసంచులు వాడుకోవాలని కోరారు. అనంతరం జనపనార సంచులు పంపిణీ చేశారు. సీటీఆర్ఐ హెడ్ డాక్టర్ అనూరాధ, ఐటీసీ సైంటిస్ట్ బీఎస్ రెడ్డి, ఐటీసీ మేనేజర్ శివకుమార్, బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పొద వరప్రసాద్, పొగాకు బోర్డు సిబ్బంది, వెల్లంపల్లి పొగాకు బోర్డు పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి

- ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు రాష్ట్ర అధికారి అశోక్‌రెడ్డి పిలుపు
- ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారిగా డాక్టర్ హర్షప్రీతమ్ దేవ్‌కుమార్



అవార్డు గ్రహీత హర్షప్రీతమ్ దేవ్‌కుమార్‌ను సన్మానిస్తున్న యూనివర్సిటీ అధికారులు

ఒంగోలు సెంట్రల్: నేషనల్ సర్వీస్ స్కీము (ఎన్ఎస్ఎస్) విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన, నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి పి.అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారిగా అవార్డు పొందిన డాక్టర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్‌కు బుధవారం అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు దేశ సమగ్రతకు, సమైక్యతకు పాటుపడాలని, దేశ స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అవార్డు గ్రహీత హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యారంగం ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తోందని, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవాభావం కలిగి సామాజిక సమస్యల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.కరుణ, రెక్టార్ ప్రొఫెసర్ ప్రసాద్‌మూర్తి, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ ఎన్ఎస్ఎస్ అధికారిగా అవార్డు పొందిన హర్షప్రీతమ్ దేవ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

మనస్తాపంతో వృద్ధుడు ఆత్మహత్య

కొత్తపట్నం (ఒంగోలు సెంట్రల్): మండలంలోని మడనూరు ఎస్సీకాలనీకి చెందిన వృద్ధుడు బిల్లా బాబూరావు (63) మనస్తాపంతో పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన భార్య రెండు సంవత్సరాల క్రితం మృతి చెందింది. ఈ నేపథ్యంలో పురుగు మందు తాగడంతో 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కొత్తపట్నం ఎస్సై సాంబశివరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించిన మేయర్



పనులను ప్రారంభిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సిటీ: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సొంత నిధులతో సమకూర్చిన జేసీబీతో నగరంలోని 18వ డివిజన్ చెరువుకొమ్ముపాలెంలో జంగిల్ క్లియరెన్స్ పనులను ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి జేసీబీ ఉపయోగించుకోవాలని సూచించారు. అందుకు సహాయ సహకారాలు అందిస్తున్న ఒంగోలు ఎంపీ మాగుంటకు మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

షిర్డీలో సాయినాథుడిని దర్శించుకున్న శిద్దా కుటుంబం



షిర్డీ సాయి సంస్థాన్‌కు రూ.5 లక్షల విరాళం అందిస్తున్న శిద్దా కుటుంబం

ఒంగోలు: మహారాష్ట్రలోని షిర్డీలో సాయినాథుడిని శిద్దా కుటుంబీకులు బుధవారం దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, వారి కుమారుడు, టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌కుమార్ కుటుంబీకులు కలిసి షిర్డీ సాయిసంస్థాన్ షిర్డీ సాయి బాబా మందిరంలో సాయినాథుడి ధూపహారతి సేవలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు శిద్దా కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, షిర్డీ సాయి సంస్థాన్‌కు రూ.5 లక్షల విరాళాన్ని శిద్దా కుటుంబీకులు అందించారు. అనంతరం షిర్డీ సంస్థాన్ అధికారులు శిద్దా రాఘవరావు దంపతులు, సుధీర్‌కుమార్ దంపతులు, మన్యం ఫణికుమార్ దంపతులకు సాయినాథుడి ప్రసాదాన్ని అందించి శాలువాతో సత్కరించారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

ఒంగోలు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ బుధవారం ప్రారంభమైంది. బీజేపీ నాయకుడు ధనిశెట్టి రామునాయుడు 27వ డివిజన్‌లో తెనాలి కరుణకు ఉజ్వల కనెక్షన్‌ను గ్యాస్ ఏజెన్సీతో కలిసి అందజేశారు. జిల్లాలో పది వేల వరకు గ్యాస్ కనెక్షన్‌లు మంజూరయ్యాయని,ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందజేస్తారని, సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ కూడా వస్తుందని బీజేపీ నాయకులు వివరించారు.

జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు మేలు

- జేపీవీపై సమీక్షలో అధికారులు



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి

ఒంగోలు సెంట్రల్: పాడి రైతులకు మరింత మేలు చేకూర్చేందుకే జగనన్న పాల వెల్లువ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించినట్లు జిల్లా అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని వైఎస్సార్ క్రాంతి పథం సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖ, కోఆపరేటివ్, వైఎస్సార్ క్రాంతి పథం క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ.. పశుపోషకులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చి జగనన్న పాల వెల్లువ పథకం విజయవంతానికి పశు సంవర్ధశాఖ అధికారులు మరింత కృషి చేయాలని చెప్పారు. వైఎస్సార్ కేపీ-డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు కలిగిన మేలును రైతులందరికీ వివరించాలని చెప్పారు. పాల వెల్లువ పథకం ప్రారంభించిన తర్వాత రూ.50గా ఉన్న లీటరు పాలకు రూ.80 వరకు ధర దక్కుతోందని చెప్పారు. అన్ని వర్గాల పాడి రైతులకు పీఎంఎఫ్ఎంఈ ద్వారా సబ్సిడీపై రెండు గేదెలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కోఆపరేటివ్ శాఖ అధికారి పి.రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ చేయూతను వినియోగించుకుని పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. పాల ఉత్పత్తిని పెంచడంపై దృష్టి సారించాలని ఆయా శాఖల సిబ్బందికి జిల్లా అధికారులు దిశానిర్దేశం చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామంలో యువతి అదృశ్యంపై మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన యువతి వారం రోజుల క్రితం ఒక వేడుకకు ఏడుగుండ్లపాడు వచ్చింది. మంగళవారం రాత్రి పది గంటల సమయంలో కనిపించకపోవడంతో బంధువులు గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో యువతి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు బుధవారం మద్దిపాడు చేరుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.